సాక్షి
పల్నాడు
మంగళవారం । 12 । సెప్టెంబర్ । 2023

టీడీపీ బంద్ విఫలం

- బయటకు రాని తెలుగు తమ్ముళ్లు
- ఇళ్లకే పరిమితమైన ముఖ్యనేతలు
- అక్కడక్కడా కొందరి హడావుడి
- యథావిధిగా జనజీవనం


నరసరావుపేట మెయిన్‌రోడ్డులోని మల్లమ్మ సెంటర్ సమీపంలో తెరిచి ఉన్న షాపులు

సాక్షి, నరసరావుపేట: చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా సోమవారం తెలుగుదేశం పార్టీ చేపట్టిన బంద్ ప్రభావం జిల్లాలో కానరాలేదు. తెలుగు తమ్ముళ్లు బయటకు రాలేదు. ముఖ్యనేతలూ ఇళ్లకే పరిమితమయ్యారు. జనసేన, సీపీఐ, ఎమ్మార్పీఎస్, జై భీమ్ పార్టీలు బంద్‌కు మద్దతు తెలిపినా ఫలితం శూన్యం. ఆర్టీసీ బస్సులు యథావిధిగా తిరిగాయి. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు తెరుచుకున్నాయి. టీడీపీ నాయకులు కొన్ని చోట్ల దుకాణాలు మూసివేయాలని కోరినా ప్రజల నుంచి స్పందన లేదు. పిల్లల భద్రత దృష్ట్యా కొన్ని విద్యాసంస్థలు మాత్రం మూతపడ్డాయి. ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది బందోబస్తును పర్యవేక్షించారు.

- జిల్లా కేంద్రం నరసరావుపేటలో బంద్ ప్రభావం ఏమాత్రం కనిపించలేదు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు నిర్వహించే ఆస్పత్రులు, దుకాణాలను మాత్రం మధ్యాహ్నం వరకు మూశారు.
- టీడీపీ నేత డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెల్లవారుజామున ఆర్టీసీ గ్యారేజ్ వద్ద ఇద్దరుముగ్గురితో కలిసి హడావుడి చేశారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు.
- గురజాలలో టీడీపీ నేతలు దుకాణాలు మూసేయాలని కోరినా వ్యాపారులు పట్టించుకోలేదు.
- వినుకొండలో కొందరు బైక్‌ర్యాలీ చేపట్టగా వారిని పోలీసులు స్టేషన్‌కు తరలించారు. అల్లరిమూకలు ఆర్టీసీ బస్సుపై రాళ్లు రువ్వి పరారయ్యాయి.
- చిలకలూరిపేట, మాచర్ల, సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లో బంద్ ప్రభావం లేదు.

బాబు పాపం పండింది

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



మాచర్ల: మాజీ సీఎం చంద్రబాబునాయుడి పాపం పండిందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి(పీఆర్కే) విమర్శించారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో పీఆర్కే వైఎస్సార్ సీపీ యువజన విభాగం మూడు జిల్లాల జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. వ్యవస్థలను మేనేజ్ చేసి ఇన్నాళ్లూ తప్పించుకున్న చంద్రబాబు ఇప్పటికి చట్టానికి చిక్కారని పేర్కొన్నారు. అమరావతి భూములతోపాటు అనేక స్కాంలు చేసి వేలాది కోట్ల రూపాయలు పొందిన ఘనత చంద్రబాబుకే దక్కుతోందన్నారు. అవినీతి బయటపడిన ప్రతిసారీ రంగులు మారుస్తూ రాజకీయం చేసి తప్పించుకోవటం బాబుకు అలవాటైందన్నారు. ప్రస్తుతం సీఐడీ స్వతంత్రంగా విచారించి పూర్తి ఆధారాలతో బాబు అవినీతిని బయటపెట్టిందని స్పష్టం చేశారు. బాబును నిబంధనల ప్రకారమే రిమాండ్‌కు పంపారన్నారు. దీనిపై సానుభూతి కోసం టీడీపీ యతి్నంచిందని, బంద్‌కు పిలుపునిచ్చినా ఎక్కడా స్పందన రాలేదని పిన్నెల్లి స్పష్టం చేశారు. టీడీపీ ముఖ్యనాయకులూ బంద్‌లో పాల్గొనలేదని ఎద్దేవా చేశారు. వారికీ చంద్రబాబు మోసాలు, అవినీతి తెలుసుకనుకే బయటకు రాలేదని పిన్నెల్లి పేర్కొన్నారు. సామాన్య ప్రజలకు న్యాయం చేయగలిగే నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని పిన్నెల్లి ఉద్ఘాటించారు. సీఎం జగన్ ఎవరిపైనా కక్ష సాధింపు చర్యలకు పాల్పడలేదని, బాబు కేసు విషయంలో ప్రభుత్వ ప్రమేయం లేదని స్పష్టం చేశారు. చేసిన పాపాలకు బాబు శిక్ష అనుభవించాల్సిందేనని పీఆర్కే, పీవీఆర్ స్పష్టం చేశారు.

స్కిల్ డెవలప్‌మెంట్ దోషి చంద్రబాబే

- చంద్రబాబు, లోకేశ్ ప్రజాధనాన్ని లూటీ చేసిన దొంగలే
- దొంగను జైలుకు కాక ఎక్కడికి పంపించాలి
- చంద్రబాబు అరెస్ట్ సాకుతో రాష్ట్రంలో అలజడులకు కుట్ర
- వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల) : స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో రూ.317 కోట్లు దోచుకున్న చంద్రబాబునాయుడును చట్టప్రకారం జైలుకు పంపిస్తే టీడీపీ నేతలు ఆందోళనలు చేయడం సిగ్గుచేటని వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ తొమ్మిదేళ్ల ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా, 2014–19 వరకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు వేల కోట్లు ప్రజాధనాన్ని లూటీ చేశారని, వంద శాతం నేరం చేశారు కాబట్టే జైలుకు వెళ్లారని అన్నారు. చట్టం అందరికి సమానమేనని ఇతరులు అయితే ఒక న్యాయం చంద్రబాబు అయితే మరో న్యాయం అనే విధంగా టీడీపీ నేతల వ్యవహార శైలి ఉందన్నారు. చట్టప్రకారం జైలుకు పంపితే టీడీపీ నేతలు అరాచకాలు సృష్టించాలని, ఆందోళనలు చేయాలని పిలుపునివ్వడం ఏమిటని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అప్పటి సోనియాగాంధీ, చంద్రబాబు కుట్రపూరితంగా జైలుకు పంపారని, చంద్రబాబు నేరం చేశాడని జైలుకు పంపితే టీడీపీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని అన్నారు. చంద్రబాబు, లోకేశ్ ఇద్దరూ కలిసి వందల కోట్ల ప్రజాధనాన్ని లూటీ చేశారని, లోకేశ్ కూడా జైలుకు పోయే రోజులు దగ్గరపడ్డాయన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ చిన్న కేసు మాత్రమేనని, ఇంకా వేల కోట్ల కుంభకోణాలు వెలుగులోకి వస్తాయన్నారు. రింగ్ రోడ్డు వ్యవహారంలో మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేల పాత్ర కూడా ఉందని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులుకు రూ.2400కోట్లు నిధులు ఇచ్చానని లోకేశ్ స్వయంగా చెప్పాడని, ఆ నిధులు ఏమయ్యాయో చెప్పాలని ప్రశ్నించారు. లోకేశ్ ఎర్రబుక్ పేరుతో అందరి పేర్లు రాస్తున్నానని, ఎర్ర బుక్‌లో ముందుగా చంద్రబాబు, లోకేశ్ పేర్లే రాసుకోవాలని, ఎక్కువ నేరాలు చేసిన జాబితాలో తండ్రీకొడుకులే ముందున్నారన్నారు. చంద్రబాబు అరెస్ట్ సందర్భంగా వినుకొండలో బస్సు అద్దాలు పగలగొట్టిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇక టీడీపీ పని అయిపోయిందని, రాష్ట్ర ప్రజల మద్దతు కూడగట్టలేక ప్రజల ఆస్తులు ధ్వంసం చేయాలని పిలుపునివ్వడాన్ని తప్పుపట్టారు. ప్రజలంతా గమనిస్తున్నారని రానున్న రోజుల్లో టీడీపీ కనుమరుగవుతుందని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యులు గుండాల స్వెనోమ్, వైఎస్సార్ సీపీ నాయకులు హనుమయ్య, రఫీలతో పాటు పలువురు పాల్గొన్నారు.

పొంగి ప్రవహిస్తోన్న వాగులు

- జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు
- నిలిచిన వాహన రాకపోకలు
- నీట మునిగిన పంట పొలాలు


పెదమద్దూరు వద్ద చప్టాపై ప్రవహిస్తున్న వరద నీరు

అమరావతి: జిల్లా వ్యాప్తంగా ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. వర్షానికి వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో ఆయా మార్గాలలో రాకపోకలు నిలిచిపోయాయి. పలు ప్రాంతాల్లో పత్తి, మిరప, వరి పంటలు నీట మునిగాయి. అమరావతి మండలంలోని ఎండ్రాయి వద్ద కొండవీటి వాగు, నరుకుళ్లపాడు వద్ద మేళ్లవాగు సుమారు 10 అడుగుల మేర పొంగి ప్రవహిస్తున్నాయి. పెదమద్దూరు వద్ద మద్దూరువాగు ఉధృతగా ప్రవహిస్తూ గంటగంటకు నీటిమట్టం పెరుగుతూ సోమవారం సాయంత్రానికి చప్టాపై ఐదు అడుగుల మేర నీరు ప్రవహిస్తుంది. సోమవారం ఉదయం నుంచి అమరావతి–విజయవాడకు వాహనాల రాకపోకలు నిలిపివేశారు. కృష్ణానదిలోకి ఎగువన ఉన్న మునేరు వాగు నుంచి వరద నీరు ఎక్కువగా వస్తోంది. ఎగువ భాగాన ఉన్న పత్తి పొలాలు పూర్తిగా నీటమునిగాయి. ఎగువ నుండి నీరు రావటం, భారీ వర్షాలు కురవడంతో వాగుల పరివాహక ప్రాంతాలలో పత్తి, మిరప, వరి వంటి పంటలు నీటమునిగిపోయాయి. మెట్ట పొలాల్లో సాగు చేసే రైతులకు ఈ వర్షాల వల్ల ప్రయోజనం చేకూరినప్పటికీ పల్లపు ప్రాంతాలలో పంటలు నీటమునిగాయి.

పెదకూరపాడు: పెదకూరపాడు, అమరావతి మధ్య నీరుకుంట, పరసవాగు, లింగాపురం వాగు, పెదకూరపాడులోని పేరమ్మవాగు, చినమక్కెన వద్ద ఉన్న లో లెవల్ చప్టా, కంభంపాడులోని ఎద్దువాగు, పాటిబండ్ల వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పెదకూరపాడు, గుంటూరు మధ్య పెదకూరపాడులోని లో లెవల్ చప్టాపై వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో ఇళ్లల్లోకి నీరు చేరింది. బలుసుపాడు గ్రామంలో ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరింది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కంభంపాడు వద్ద వాగు ఉధృతంగా ప్రవహించడంతో వందల ఎకరాల్లో పత్తి పంట పూర్తిగా నీట మునిగింది. బలుసుపాడు గ్రామం వద్ద వరిపంట నీట మునిగింది.


ఉధృతంగా ప్రవహిస్తున్న కంభంపాడు వాగు

మండలాల స్థాయిలో జగనన్నకు చెబుదాం

నరసరావుపేట: ప్రజా సమస్యల పరిష్కార వేదిక జగనన్నకు చెబుదాం జిల్లాలోని మండలాల స్థాయిలో బుధ, శుక్రవారాలలో ఈనెల 13 నుంచి 29వ తేదీవరకు ఉదయం 10 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 13న నూజెండ్ల, 15న పిడుగురాళ్ల, 20న కారంపూడి, 22న రొంపిచర్ల, 27న రాజుపాలెం, 29న అచ్చంపేట మండలాల్లో నిర్వహిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పకడ్బందీగా నిర్వహించాలి

- చైల్డ్ హెల్త్ స్టేట్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ అర్జునరావు
- అధికారులకు దిశానిర్దేశం


కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ అర్జునరావు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవి

నరసరావుపేట: జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎటువంటి అలసత్వం చూపించకుండా పకడ్బందీగా నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని చైల్డ్ హెల్త్ విభాగ స్టేట్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కె.అర్జున్‌రావు ఆదేశించారు. సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలు ప్రణాళిక రచన సందర్భంగా అధికారులతో సమావేశమయ్యారు. డివిజన్ వారీగా ప్రోగ్రాం అధికారులను నియమించి అమలుకు ప్రణాళికను తయారు చేయాలన్నారు. జిల్లాలో 28 మండలాలు, ఎనిమిది మున్సిపాలిటీలలో ప్రోగ్రాం అమలు చేయాలన్నారు. ఈనెల 15వ తేదీ నుంచి ఆఖరి వరకు జరిగే కార్యక్రమంలో అందరూ ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు గ్రామంలో ప్రతి ఇంటిని సందర్శించి వ్యాధిగ్రస్తుల జాబితాను తయారుచేయాల్సి ఉందన్నారు. తదుపరి ఈ నెల 30వ తేదీ నుంచి అక్టోబర్ 30 వరకు ప్రతి సచివాలయంలోని హెల్త్ సెంటర్లలో ఇద్దరు వైద్యాధికారులు, స్పెషలిస్ట్ డాక్టర్లయిన గైనకాలజిస్టు, చిన్నపిల్లల వైద్యులు, జనరల్ ఫిజీషియన్ బృందం పరీక్షించి 14 రకాల పరీక్షలు చేసి 105 రకాల మందులను అందజేస్తారని తెలిపారు. స్పెషాలిటీ వైద్యం అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ కార్యక్రమం కింద జిల్లాలోని స్పెషాలిటీ హాస్పిటళ్లకు తరలిస్తారన్నారు. జిల్లా డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రవి మాట్లాడుతూ కార్యక్రమాన్ని విజయవంతం చేయటానికి జిల్లాలోని అందరు అధికారులు సహకరించాలని కోరారు. అదేవిధంగా ఆరోగ్యశ్రీ కో–ఆర్డినేటర్ డాక్టర్ పి.సునీల స్పెషలిస్ట్ డాక్టర్లను ప్రాంతాలు వారీగా నియమించాల్సిందిగా కోరారు. ప్రభుత్వం ఈకార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నందున అధికారులు శ్రద్ధతో పనిచేసి, జయప్రదం చేయాలని కోరారు. నోడల్ ఆఫీసర్ డాక్టర్ డి.హనుమకుమార్, ఉప జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి.చంద్రశేఖర్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ బి.గీతాంజలి, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ అండ్ టీబీ ఆఫీసర్ డాక్టర్ కె.పద్మావతి, జిల్లా ఉప మాస్‌మీడియా అధికారి కె.సాంబశివరావు, జిల్లా మలేరియా అధికారి కె. రవి రత్నాకర్‌రావు, లెప్రసీ న్యూక్లియర్ అధికారి పాల్గొన్నారు.

జాతీయస్థాయి పద్యనాటక పోటీల విజేతలు వీరే..

విజయవాడకల్చరల్: శ్రీదేవి కళా నాట్యమండలి, గుమ్మడి జయరాజ్ కళాపీఠం, సాయి హృదయ నాట్య మండలి ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై ఈనెల 9, 10 తేదీల్లో జరిగిన సత్యహరిశ్చంద్ర నాటక పద్యగాన పోటీల విజేతలను నిర్వాహక సంఘ సభ్యులు గుమ్మడి జయరాజ్, అవినాష్ గుమ్మడి, అరుగు త్రినాథనాయుడు సోమవారం ఒక ప్రకటనలో ప్రకటించారు. గుంటూరుకు చెందిన తేళ్ల రామారావు ప్రథమ బహుమతి, ఎన్టీఆర్ జిల్లా లోని చందర్లపాడుకు చెందిన కస్తాల దుర్గారావుకు ద్వితీయ, పల్నాడు జిల్లా అచ్చంపేటకు చెందిన నీలం దుర్గారావు తృతీయ బహుమతి పొందారు. దొడ్డా మిషాక్ రాజు(కృష్ణా), కె.ఇజ్రాయిల్(బాపట్ల), ముత్యాల నాగేశ్వరరావు (కృష్ణా), మరియదాసు(గుంటూరు), వి.వి.శివారెడ్డి(గుంటూరు)కి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. వి.నారాయణ (మహబూబ్‌నగర్), పాణ్యం దత్తాశర్మ(హైదరాబాద్)కు ప్రత్యేక బహుమతులను ప్రకటించి నగదు బహుమతిని అందజేశారు.

మీ చిట్టి చేతులతోటే మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో

SAKSHI
SAKSHI DIGITAL
MEDIA GROUP

ఆంధ్రప్రదేశ్
ANDHRA PRADESH
AP Pollution Control Board

వినాయకుని పుట్టినరోజు ... గణేశ్ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా... అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతి సిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా... మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరండేం! సమయం ఆసన్నమైంది. 'అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే అనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా... ఇప్పుడెలా' అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. ప్రతి సంవత్సరం లాగే ఇప్పుడు కూడా సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది. ఈ నెల 16వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించ నక్కరలేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు. అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే... దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకు వెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్‌బాటిల్, పాతవస్త్రం వెంటతీసుకు రావడం మాత్రం మరచిపోవద్దేం!

అవిఘ్నమస్తు, అభీష్ట సిద్ధిరస్తు.

శిబిరం చిరునామా:

సీబీఐటీ స్కూలు, నియర్ 60 ఫీట్ రోడ్, ప్రకాష్‌నగర్, నరసరావుపేట.

తేదీ : 16-09-2023 (శనివారం)

సమయం : ఉ. 9.30 గం.ల నుంచి మధ్యాహ్నం 12.30 గం.ల వరకు.

రిజిస్ట్రేషన్లకు సంప్రదించవలసిన ఫోన్ నంబరు : 97030 13015

District sponsor
VIVA THE SCHOOL BY VVIT

మానవత్వంతో ప్రజా సమస్యల పరిష్కారం : కలెక్టర్


ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: ప్రజా సమస్యల పరిష్కారంలో జిల్లా, మండల అధికారులు మానవత్వం చూపాలని కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్పందన హాలులో సోమవారం జగనన్నకు చెబుదాం (స్పందన) ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాదు, డీఆర్వో కె.వినాయకంలతో కలిసి ప్రజల నుంచి 52 అర్జీలను స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున అర్జీదారులు కలెక్టరేట్ కార్యాలయానికి తరలి వచ్చి తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాలను అందజేశారు. వాటిని స్వీకరించిన కలెక్టర్, ఇతర జిల్లా అధికారులు సంబంధిత శాఖల అధికారులకు అందజేసి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అర్జీదారులకు జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో దాతలు అన్నదానం చేశారు. దాతలను జిల్లా అధికారులు సత్కరించారు.

18 ఆదిశంకరాచార్యుల విగ్రహావిష్కరణ



సత్తెనపల్లి: మధ్యప్రదేశ్ ఓంకారేశ్వరంలో ఈనెల 18న జరగనున్న జగద్గురు ఆది శంకరాచార్యుల విగ్రహావిష్కరణకు హాజరు కావాలని సత్తెనపల్లి త్రిశక్తి దుర్గా పీఠం అధిపతి వెలిదండ్ల హనుమత్ స్వామిజీకి ఆహ్వానం అందింది.

20 నుంచి కంప్యూటర్ ట్యాలీలో ఉచిత శిక్షణ

కొరిటిపాడు(గుంటూరు): యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీ నుంచి కంప్యూటర్ ట్యాలీ, బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్‌లో ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ జి.బి.కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ 30 రోజులు ఉంటుందన్నారు. శిక్షణా కాలంలో ఉచిత భోజన సదుపాయంతో పాటు ఉచిత హాస్టల్ వసతి కల్పిస్తామన్నారు. వయస్సు 19 నుంచి 44 సంవత్సరాల లోపు ఉండాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు కొత్తపేటలోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ కార్యాలయంలో తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు కాపీలు, నాలుగు పాస్‌పోర్టు సైజు ఫోటోలతో ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కంప్యూటర్ ట్యాలీ కోర్సుకు 10వ తరగతి మార్కుల జాబితా కాపీ (పాస్ లేదా ఫెయిల్) జతపర్చాలన్నారు. ఈ అవకాశాన్ని గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంత మహిళలు, నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ, ఓల్డ్ బ్యాంక్ వీధి, కొత్తపేట, 0863-2336912, 8125397953, 9700687696, 9949930155 ఫోన్ నంబర్లను సంప్రదించాలని ఆయన తెలియజేశారు.